



గుంటూరు ఫ్లాట్ ఫారమ్ మీద మాచర్ల పోయే పొగబండి, నీళ్లలో పడ్డ గేదెలా నెమరేస్తూ పడుకుంది. ఎప్పటికి కదుల్తుందో, అసలు కదుల్తుందో కదలదో, యీ లోకపు మనుష్యుల కెరుక లేదు. బుక్‌స్టాల్ చుట్టూ, రైలు పొడుగునా, ఫ్లాట్‌ఫారం ఆ మూలనుంచి యీ మూలకి, ఎన్నిసార్లు తిరిగినా రైలు మేలుకొనే సూచనలేం కనబడలేదు అవతలి ఫ్లాట్‌ఫారం మీదికి వెళ్ళి ఆ రైల్లో రంగుల్ని కూడా పరామర్శించాలనుకునేంతలో—

అంధకారంలో ఆశాకిరణంలా ఊడి పడ్డాడు రామేశం.

మొదట్లో మనిషిని పోల్చుకోలేక పోయాను. వాడికెంతో గర్వకారణమైన ఆ నొక్కులజుట్టు కాస్తా పోవడంతో బౌద్ధభిక్షువులాగ తయారయాడు ఆ

డి. హనుమంతరావు



కళ్ళలో యిదివరకటి వెలుగులేదు ఆ నవ్వులో యిలా యెప్పటికీ నవ్వుతూంటే బాగుణ్ణనిపించే ఆకర్షణ చాలా కొద్దిగానే మిగిలింది.

''ఏంరా, యిలా అయిపోయావు?'' నేనడిగిన మొదటిప్రశ్న అది. వాణ్ణంతకు ముందు చూసి రెండేళ్ళకి పైగా అయింది యీ రెండేళ్ళలో వాడూ, నేనూ ఒకరి గురించి ఒకరు తెలుసుకోడాని కంతగా ప్రయత్నించలేదు.ఆ పరిస్థితుల్లో మామూలుగా అయితే కాసేపు ఆనందబాష్పాలు కార్చడం, కౌగలించుకోడం, క్షేమం

వగైరాలు విచారించడం జరగొచ్చు.

కాని యిలాంటి వేం జరక్కుండా రామేశం వాలకం అడ్డుపడింది. వాడికేదో ఘోరవిపత్తు జరిగినట్టు, యీ లోకమంతా శూన్యం, అంధకారబంధురం, గాఢ తిమిరావృతం యిలాంటిదేదో అయిపోయినట్టూ అనిపించింది. అంతటి దుఃఖ సమయంలో అనాలోచితంగా నానుంచి బయటపడ్డ పరామర్శ ఆదే. ఏదో తెలియని, సారామత్తులాంటి విషాదం గుండెల్లోకి దిగజారింది.

రామేశం ఒకానొకప్పుడు "ఆలిండియా యాంటి-బాల్డ్‌పేట్ కమిటీ" లాంటి దొకటి స్థాపించి, మొక్కులనే మూఢ నమ్మకాలకి వ్యతిరేకంగా ప్రచారం చెయ్యాలని, తిరపతిలో పికెటింగ్ చేసైనాసరే, మనిషిలో అందం నాశనం చేసే యీ అలవాటు మాన్పించాలని ప్రయాసపడ్డాడు. కనబడిన ప్రతీవాడ్నీ పిలిచి కూర్చోబెట్టి ఓ ఉపన్యాసం యిచ్చేవాడు ; "సౌందర్యం కూడా తిండి, గాలి, నిద్రలాంటిదే ; దాన్ని గుర్తించి కాపాడుకోవాలనే జిజ్ఞాస లేనివాడు, జంతువు." అదీ అతడి సిద్ధాంతం.

రామేశం మొదట్నుంచీ సౌందర్యాన్వేషి, ఉపాసకుడు, ఆరాధకుడు, వైతాళికుడు – ఏవన్నా కానీండి, అందమంటే చాలా ఆపేక్ష. ఎప్పుడూ తెల్లబట్టలే కడతాడు. మడత నలిగినా మరక పడినా ముళ్ళమీదున్నట్టు బాధపడతాడు క్రాపు రేగితే సహించలేడు. బూట్‌కి పాలిష్ పోతే గిలగిల్లాడిపోతాడు. వాడిగురించే కాదు, ఎదటివాళ్ళ గురించి కూడా అదే శ్రద్ధ.

ఎవరన్నా అందమైన అమ్మాయి ఆకుపచ్చ చీరమీద నీలం జాకెట్టు వేసుకుని కనబడితే, లేకపోతే నుదురు విశాలం లేని అమ్మాయి నాలుగు వెంట్రుకలు ముందుకు లాక్కుని కనబడితే ఆమె గురించి ఓబహిరంగప్రకటనచెయ్యకుండా ఊరుకోలేడు. అలాగే కాస్త అందంగా కనబడే మనిషి–మనిషే అక్కర్లేదు. వస్తువు, జంతువు, బొమ్మ, పదార్థం, ఏదన్నా సరే– ఎదట తదేకంగా నిలబడి చూస్తాడు. ఈ ప్రపంచంలో ప్రతీదాన్నీ, ప్రతీ మూలనీ దేవు డందంగా సృష్టించాడు ; దాన్నలా ఉండేట్టు చూడ్డమే మనం అతగాడికి చేసే ఉత్తమ సేవ. అలా కాకుండా కొన్నిటిని వికారంగా తయారు చేసి మహాపాపం చేస్తారు కొందరు.

యిలాంటి తన అభిప్రాయాల్లో ఎంతో విశ్వాసంతో, నమ్మకంతో పట్టుదలగా అందరికీ ప్రచారం చేసినవాడు, చివరికి తనే ఉల్లంఘించడం అనేది సామాన్యంగా జరిగే పనికాదు, అందులోనూ రామేశం లాంటి పట్టుదల మనిషి ! నన్ను బాధ పెట్టిందదే.

రామేశం పెదాలమీద విషాదం జాలిగా నవ్వింది. "యీ లోకమంతా మిధ్య, నువ్వింకా అజ్ఞానంలోపడి కొట్టు

కుంటున్నావు" అన్నట్టు చూశాడు నాకేసి.

"ఎలా ఉన్నావు? ఏం కథ? యిప్పు డెక్కడ? ఉత్తరాలు రాయవేం?......" ఒకదాని తర్వాత ఒకటి గాభరాగా ఎన్నో ప్రశ్నలు వేశాను

రామేశం కొద్దిసేపు మాట్లాడలేదు తర్వాత నెమ్మదిగా అన్నాడు, "అదంతా చాలా పెద్దకథ, తీరిగ్గా మాట్లాడు కోవాలి"

రామేశం మొదట్నుంచీ చాలా విచిత్రమైన మనిషి మామూలుగా మనకి ప్రతీ వీధి మలుపులోనూ కనబడే రామారావు, సుబ్బారావు, వెంకట్రావు వగైరాలకీ రామేశానికీ ఎంతమాత్రం పోలిక కనబడదు ఏ విషయంలోనూ, ఒకేరకం పరిస్థితుల్లో యీ రామ సుబ్బయ్యలు, వెంకటప్పయ్యలు, గోవింద రామయ్యలు చేసేదానికి ఖచ్చితంగా భిన్నంగా ఉంటుంది అతను చేసేది లేక పోతే, ఎవడో స్నేహితుడు ఎక్కడో ప్లాట్‌ఫారంమీద ఎటోపోతూ తారస పడితే, "పద, నీతో వస్తా''నని అంత తేలిగ్గా, తామరాకుమీద నీటిబిందు వంటారే, అలా బయల్దేరి వచ్చేయడు

రామేశం చేతిలో భగవద్గీత, రాధా కృష్ణ వేదాంతం, వివేకానంద ఉప న్యాసాలు ఉన్నాయి వాటితో నా వెంట బడి వచ్చేస్తూంటే నాకంతా అగమ్యగోచ రంగా ఉంది ఎక్కడికి వెళ్తున్నాడు, ఎందుకు, సామానేం లేకుండా యెలా తిరుగుతున్నాడు, ఏం చేస్తున్నాడు? ఇవన్నీ నా లోపల రేగాయి గాని బయట పెట్టడానికి, వాడున్న మూడ్ సాహసం చేయనివ్వలేదు

మేమిద్దరం నా పెట్టెలో కెక్కాం రామేశం కిటికీ ప్రక్కన జేరి ఆకాశం లోకి చూస్తున్నాడు ఆ క్షణంలో వాడో అగ్నిపర్వతంలా కనబడ్డాడు అదెప్పుడు బ్రద్దలవుతుందో, ఎలా బ్రద్దలవుతుందో, అది బద్దలై కార్చే లావా వేడికి నేను తట్టుకోగలనో లేదో ఆలోచిస్తున్నాను రామేశంతో నా స్నేహం, మేమిద్దరం గడిపిన రోజులు అన్నీ సినిమాలో ఫ్లాష్‌బాక్‌లాగ కళ్ళెదట తిరిగాయి

నాకు రామేశం అంటే చాలా అభి మానం నాకేకాదు, నిజానికి రామేశాన్ని చూసిన వాళ్ళంతా వాడంటే అభిమానం చూపకుండా ఉండలేరు కపటం, కృత్రి మం తెలియవు, దేనిమీదన్నా చాలా ఖచ్చితంగా మాట్లాడతాడు ఏ విషయం గురించైనా చాలా స్పష్టంగా ఆలోచించి చెప్పగలడు

రామేశం కాలేజీలో పెద్దహీరో మనిషిబాగుంటాడు కాలేజీ రొమాన్సుల్లో హీరోలమల్లే కథలురాస్తాడు, ఉపన్యాసా లిస్తాడు కాస్తో కూస్తో అన్నిటి గురించీ తెలుసు ఇన్ని ఉన్నవాడు ఏ అమ్మా యినీ ప్రేమించలేదా అని మేమంతా చాలా కాలం మీమాంస జరిపాం అందంగా

కనబడే అమ్మాయిలు కాలేజీ నిండా రైళ్ళలో నల్లుల్లా ఉండేవాళ్ళు వాళ్ళలో ఏ ఒక్కరితోనైనా కనీసం కొంతకాలమైనా, ప్రేమాయణం జరపలేదా అనేది నా కిప్పటికీ తేలని విషయం

ఆ రోజుల్లో రామేశం ఒకమాట చాలా తరచుగా అంటూండేవాడు దాని పూర్తి భావం నేను విడమర్చి చెప్పలేనుగాబట్టి, ఉన్నదున్నట్టు చెప్తాను, "స్త్రీలోకాన్ని ఒక మూకగా, గుంపుగా ప్రేమించగలం గాని, ప్రత్యేకించి ఏవరో ఒక స్త్రీని ప్రేమించలేం!" రామేశానికి మా కాలేజీ అమ్మాయి లెవరూ నచ్చలేదన్నంతవరకే నా కర్థమయింది ఆ తర్వాతేం జరిగిందో నాకు తెలియదు

కాసేపటికి రామేశం, "హు" అని ముక్కులోంచి గాలి బలంగా వదిలాడు 'రచక' భాషలో, నిట్టూర్చాడన్నమాట రామేశమేదో చెప్పబోతున్నాడని నా ఆలోచనలన్నిటికీ ఆనకట్టకట్టి, అటు తిరిగాను కొంతసేపు నయాగరా జలపాతం లాగా, మరి కాస్తసేపు పెద్దవాన వెలిశాక చూరునించి రాలే నీటిబొట్లులాగ, మధ్య మధ్య విరామాల్తో, ఉధృతంగా, నెమ్మదిగా బయటపడే వాడి ఆవేదనంతా యీ మాదిరి ఉంటుంది

"కొన్ని నెలల్నుంచి నాలో అంతులేనిబాధ గడ్డకట్టుకుని గుండెలమీద బరువుగా కూర్చుంది దానిలో కొంతైనా బయటికి మరొకరికిచెప్పి విశ్రాంతి పొందాలంటే, ఆ మాత్రం ఓపిక, విరామం ఉన్నవాడెవడూ కనబడలేదు ...యివాళ నువ్వు'...నాకోసమే పంపించా రెవరో నిన్ను!

"ఈ ప్రపంచమంతా మాయ ఏదో ఉందనుకుంటాం అసలేం లేదు నువ్వూ లేవు, నేనూలేను మన మున్నామనుకొని మోసగించు కుంటున్నామంతే ఏదో మాయ మనిద్దర్నీ చుట్టబెట్టి, యిలా మనిద్దరం మాట్లాడుకుంటున్నట్టనిపింపజేస్తోంది ఈవాళ యీ రైల్వే ప్లాట్ఫారంమీద, ఉన్నామనీ, యిలా యెక్కడికో వెళ్తున్నామనీ అనుకుంటున్నాం అనుకుంటున్నామంతే అసలు నిజంగా మనమున్నామా? ఉంటే యీ గుంటూరు ప్లాట్ఫారంమీద నిద్రపోయేరైల్లో, అదెప్పటికో కదుల్తుందని ఆశపెట్టుకు కూర్చున్నామా? వట్టిమాట.. మనమంటూ ఉంటే, ఎక్కడో ఏనక్షత్రాల్లోనో, ఏ మబ్బు తునకలమీదో, ఏ జలపాతాల నురుగులోనో, ఏ మహాసముద్రాల హోరులోనో, కణాలుగా, అణువులుగా కనిపించకుండా ఏ మూలో అణిగిపడుంటాం ..యిదంతా మోసం, దగా'

"ఇదంతా నిజమనీ, యీ శరీరం, యీ మనుషులు, వస్తువులు, యివన్నీ నిజం, యివినావి, యివి బాగున్నాయి, యివి బాగులేవు, యివికావాలి, యివక్కర్లేదు, యిది మంచి, యిదిచెడు_యిలా



"మావాడు అస్తమానం చదువుతుంటాడు  మీరేమో చదవడు ఒగ్గి ముద్దని అంటారేంటి పంతులారూ ?"

"ఔను ! క్లాసులోకూడ 'డిటెక్టివ్' పుస్తకాలు చదువుతుంటాడు "

అనుకోడం, యిదంతా ఏమిటంటావు ? నన్నడిగితే వెర్రి, పిచ్చిఅంటాను "

రామేశం అన్నదంతా రాస్తే నిజంగానే వెర్రెత్తవచ్చు కాబట్టి, మనకవసరమయిన విషయాలు మాత్రమే ముచ్చటించుకుందాం

రామేశానికి పుష్కలంగా డబ్బుంది. చదువేదో విలాసంగా చదివాడు అతనికుద్యోగం చెయ్యాల్సిన అవసరంలేదు హాయిగా పల్లెటూర్లో యింటిదగ్గిర కూర్చొని పుస్తకాలు చదువుకుంటూ, సాయంకాలాలు పొలాలమీదికి షికారు

కొట్టి రావడం అతని దినచర్య ఊరు పక్క గోదావరి మూడు నాలుగుపాయలై పారుతూంటుంది మొదటిపాయ చాలా వరకు యిసుకమేట ఆ యిసకలో కూర్చొని కవిత్వ మల్లుకుంటూనో, లేక పోతే లోతులేని నీటిపాయల్లో గాలికటూ యిటూ కదిలే చిన్నపడవల్లో కూర్చొని పైన పోయే పక్షుల్ని పలకరిస్తూనో గడిపేసేవాడు

ఆ రోజుల్లోనే అతనిలో చిన్నమార్పు కలిగింది అతని కొక 'గొంతు' మీద మమత కలిగింది నిజం ' ఒక శబ్దాన్ని, ధ్వనిని, దానిలో మాధుర్యాన్ని మార్దవాన్ని అతను ప్రేమించాడు

"ఆ గొంతులో ఆకర్షణ నాగుండెల్ని పిసికి పిప్పిచేసేది ఒకోసారి, భరించ లేక దూరంగా పారిపోయేవాడ్ని. కాని అది వినాలనే ఆరాటం మనశ్శాంతి దక్కనిచ్చేది గాదు యీ రెంటిమధ్యా పడి నలిగి నేనుపడ్డ క్షోభ, దానిలో ఆనందం, సుఖదుఃఖాల కతీతమైన ఏదో నిర్వచనంలేని అనుభూతి—అది నేను చెప్ప డానికి మాటల్లేవు ''

రామేశం నిజంగా బెంగలో పడ్డాడు ''అంతరిక్షంలో అనంతదూరం ప్రయాణించి వచ్చిన ఆ తియ్యని మాటలు మనసుకి రాపిడిపెట్టి కలతతో దైన్యంతో ఊపిరాడనిచ్చేవి గావు"ట '

ఒకనాడు ఆమె పేరు విన్నాడు 'కరుణామయి' ఎంత అందమైన పేరు '

రామేశం చాలా ఉదయాలు యింటి ముందు వరండా వాలుకుర్చీలో సాగిలబడి ఎదురుగ్గా ఆకుపచ్చటి కొబ్బరి ఆకుల మీద మెరిసే లేతయెండని చూస్తూ ఆలోచించాడు

చాలా మధ్యాహ్నాలు గదిలో పరుపుల మీద వెల్లకిలా పడుకుని, పైన దూలాలకేసి చూస్తూ ఆలోచించాడు

చాలా సాయంకాలాలు గోదావరి లంకల మధ్య యిసకలో కూలబడి నీలంగా ఆకుపచ్చగా రెండంగుళాలు లోతున పారుతున్న చిన్న సెల అలల కింద మెరిసే నున్నటి తెల్లగులకరాళ్ళని చూస్తూ ఆలోచించాడు

ఇంకా చాలారాత్రులు, డాబాపైని పేంసోఫాలో వాలి పొగ, వెన్నెల కలిసిపోయిన కాంతుల్లో దూరంగా మామిడి చెట్టుమీద తలక్రిందుల పక్షులుచేసే రొద వింటూ ఆలోచించాడు

ఎంతాలోచించినా ఫలితం ఒక్కటే

ఏ పిలుపువిన్నా, ఏ శబ్దంవిన్నా కరుణామయే తియ్యగా పలకరిస్తున్నట్టు, ఏ తెల్లమబ్బు ముక్కని చూసినా, యింకే అందమైన వస్తువుని చూచినా కరుణామయే కనిపిస్తున్నట్టు అనిపించేది

ఇంతెందుకు ' రామేశం కరుణామయిని ప్రేమించాడు

అయితే యీ ప్రేమకి బదులు రాకపోవడంతో మరీ బాధగా తయారయింది.

ఇలా ఉండగా—

'రామేశం బాధకి ఉపశమనం కలగడం మాట అటుంచి, ఒక మబ్బులునిండిన సుప్రభాతాన అదికాస్తా రెట్టింపైంది ఒక వారపత్రికలో కరుణామయి కథొకటి అచ్చయింది- అందమైన బొమ్మతో చక్కటి కాగితాలమీద రంగుల్లో ఆమె పేరు ముచ్చటగా పెద్దపెద్ద అక్షరాల్తో' 'కరుణామయి' 'రామేశానికి ప్రపంచమంతా తనమీద కత్తిగట్టినట్టనిపించింది

ఆ బాధ అందరికీ అర్థంకాకపోవచ్చు కాని యింతకుముందే చెప్పినట్టు రామేశం అందర్లాంటివాడూ కాదు అత నీవేదన భరించలేక చాలా క్రుంగిపోయాడు

ఏదో ఒకటి చెయ్యాలనే నిశ్చయాని కొచ్చాడు చివరికి ఆమె కథ ప్రచురించిన పత్రిక్కి రాసి ఆమె చిరునామా తెలుసుకున్నాడు బయల్దేరాడు

ఆమె గొంతులో కోటికోయిలలు మేళవించి పాడతాయి ఆమె కథల్లో యీ లోకాన్నంతనీ ఆవరించిన విశ్వప్రేమ ప్రతిబింబాలు తొంగిచూస్తాయి ఆమె పేరులో యీ ప్రపంచంలోని లాలిత్యం, మాధుర్యం అంతా యిమిడి ఉంది ఆమె ఉన్న ఊరు యీ దేశంలో ఉన్న ఊర్లన్నిట్లోకీ చాలా అందమైన వాటిలో ఒకటి '

రామేశంలోని సౌందర్యాపేక్షకి తృప్తి దొరికింది. తన ఆదర్శాన్ని నెరవేర్చుకుంటున్నట్టు, తన నెంతగానో బులిపించి తనకి దూరంగా ఉండిపోయిన గమ్యాన్ని చేరుకుంటున్నట్టు అనిపించి మురిసిపోయాడు

రైల్లోపోతూ కరుణామయిని గురించి దారిపొడుగునా కలలుకన్నాడు ఆమె చుట్టూ గుళ్ళు, గోపురాలు, తాజ్ మహాళ్ళు, ఎన్నో కట్టుకున్నాడు ఒక కలకాగానే, "టురుమ్" మని మ్యూజిక్, ఫేడౌట్, మళ్ళా యింకో కల, అలా!


ఒక కలలో కోవెలా, కోనేరూ, మధ్యలో పెద్ద కలువపువ్వు చెంతగా కరుణామయి, మరోదానిలో పెద్ద అడివి, మల్లెపూలు, పొదలు వీటిమధ్య ఓ లేడి పిల్లని కౌగలించుకుని శకుంతలలాగా కరుణామయి! యిలా యెన్నో!

ఊరు ఊహించినంత వాగా లేదు ఊరెలా ఉంటే మనకేం అని హోటల్లో జేరాడు రామేశం ఆ సాయంకాలం వీధు లెంటబడి ఎడ్రస్ వెతుక్కుంటూ తిరిగాడు

తిరగ్గా తిరగ్గా యెవరో చివరికో యిల్లు చూపించారు బాగా క్రిందికంటా దిగ జారిన పైకప్పు, చుట్టూ పెంట కుప్పలు, ఎంగిలాకులు, గిలాబా ఊడిన గోడలు, తుప్పుపట్టిన ఊచల్తో కిటికీలు- యివన్నీ ఉన్నయిల్లు'

ఎదురుగ్గా ఓ "కృష్ణా గోదావరీ సమానురాలు" ప్రత్యక్షం'

(రామేశానికి ఉత్తర హిందూదేశపు నదుల్లో ఎందుకు చెప్పాలో అర్థంగాదుట అందుకని మన రెండు నదుల పేర్లు చెబు



తూంటాడు ప్రాంతీయాభి మానమయితే కావచ్చుగాని రామేశానికి ద్రావిడమున్నే ట్రకజగంతో సంబంధంలేదు )

ఆమె రామేశం పూర్తి వివరాలన్నీ కష్టమ్సు వాళ్ళలా గుచ్చిగుచ్చి అడిగింది అదోలా చూస్తూ కరుణామయికి మామ్మో, అమ్మమ్మో అయుంటుం దనుకున్నాడుగాని చివరికి విచారణ మీద తేలిందేమంటే ఆమె అత్తగారు

రామేశాని కింకక్కడ ఉండ బుద్ధికాలేదు తనేదో పెద్ద తప్పు చేస్తున్నట్టు బాధ పడ్డాడు తనింత కాలంగడిపిన స్వర్గంలోంచి అక్కడి వాళ్ళంతా క్రిందికి నెట్టేసి నట్టనిపించింది

ఇంతదూరమూవొచ్చి ఆమె దర్శనం కాకుండా వెళ్ళడం మంచిదిగాదని నిలబడి పోయాడు



కాసేపటి కో పెద్ద మనిషి బయటి కొచ్చి యెగాదిగా చూసి లోపలికి రమ్మని పిలిచాడు లోపల ఓ పెద్ద పొడుగాటిబల్ల, తాతల్నాటి యినప వాలుకుర్చీ ఉన్నాయి. ఆ వాలుకుర్చీలో కూర్చోమన్నాడాయన.

రామేశాన్ని కూర్చోబెట్టి ఆయన నిల్చొనే వివరాలన్నీ వాకబుచేశాడు. అతనిలో గౌరవం మర్యాదలాంటి అతిథి సత్కార లక్షణాలు అంతగా కనపడలేదు యితనంటే యిష్టపడినట్టూ తోచలేదు

రోజూ నవ్వి పలకరించే స్నేహితుడు ఏదో ఒక రోజు పరధ్యానంలో మాట్లా

డకపోతే, తల కొట్టేసినట్టు మధన పడే రామేశానికి వాళ్ళ మాటలు, చేతలు అంతగా నచ్చకపోవడంలో ఆశ్చర్యం లేదు

చివరి కెక్కడికో బయటికిపోతూ అత నన్నాడు

"సుబ్బులు లోపల వంట పని చూసు కుంటోంది, వస్తుంది, కూచోండి"

రామేశానికి వీపు మోదినట్టయింది ఏదో యింద్రజాలంలోంచి బయట పడ్డట్టు ఫీలయ్యాడు "నే నొచ్చింది కరుణా మయిగారి కోసం, సుబ్బులు, దిబ్బులు కోసంగాదు" అందామనుకున్నాడుగాని మాట పెగల్లేదు

అతని కోరిక తీరిన క్షణం వచ్చింది అత్తగారు లోప లెక్కడో గుర్రుపెట్టి నిద్ర పోతోంది ఆమె బయటి కొచ్చింది

ఇక ఆ తర్వాత చెప్పడానికి రామేశం కొంచెం యిబ్బంది పడ్డాడు నే నేమనుకుంటున్నానోనని మధ్య మధ్య ఆగి చూడసాగాడు నడివయసు, లావు, పొట్టి, మిట్టపళ్ళు, లోతుకళ్ళు యిలాంటి వన్నీ చూశాక ఎంతటి ఆరాధకుడికైనా ఆమెలో అంద ముందని చెప్పడం అంత తేలిక పనిగాదుట।

మొదట్లో కాసేపు రామేశం ఆమె కధల్లో ప్రత్యేకతని, పాటల్లో మాధు ర్యాన్ని పొగిడాడు తనామె అభిమానుల్లో ఒకణ్ణని చెప్పుకున్నాడు యిహ ఆ తర్వాత ఆమె మొదలెట్టింది

"నాకీ మధ్య అభిమానుల బెడదెక్కు వైంది రోజూ, ఎవరో పాపం యెంతో దూరం నుంచి వెతుక్కుంటూ వస్తారు ఏమేమో అడుగుతారు వాళ్ళ అమాయ కత్వానికి నవ్వొస్తుందొకోసారి కధలెలా రాస్తారని అడుగుతారు కొందరు కాగితం మీద కలంతో రాస్తానని చెప్పాలని పిస్తుంది కాని ఏమన్నా ఫీలవుతారేమో నని జంకుతాను అసలు కధలుగాని ఏవన్నాగాని రాయాలంటే ముందు చాలా చదవాలండి ఎంతో చదివుంటేనేగాని కాగితంమీద కలం నడవదు నాకు మొదట్నుంచి పుస్తకాలంటే చాలా యిష్టం అసలు కనబడిన ప్రతీ కాగితం చదవాలనుండేది అంత అలా చదివితేనే గాని యిప్పుడీ స్థాయికి రావడం కష్టం టాగోర్, సరోజిని, కబీర్ లాంటి యీ దేశపు సరుకేకాకుండా, యీట్సు, కీట్సు, యిలియట్, పెర్సీ వగైరా లెంతో మందిని చదివుండకపోతే యిలా రాయ గలిగేదాన్ని కానేమో। నిజానికి నా మీద వాళ్ళ ప్రభావం చాలా ఉంది ఉదా హరణకి, మీరు చదివారోలేదో, నాగేయం "చుక్కల్లో మచ్చలు"లో పెర్సీ కవిత్వం ఛాయలు కనబడతాయి అలాగే నేనీ మధ్య పూర్తిచేసిన నవల 'ఇక్కడ్నుంచి ఆకాశానికి' లో కాలెటీ అద్భుత కల్పనకి ప్రతిబింబాలు చూస్తారు...అసలు మన భారత రచయితల్లో స్పష్టంగా, వాస్త వికంగా, సూటిగా చెప్పే గుణంలేదు

పెద్దవాళ్ళని అంటున్నా ననుకోకండి, ఉన్నమాట చెప్పుకోవాలి యూరోపియన్ – ముఖ్యంగా ఫ్రెంచి రచయితల్లో ఉన్న నిర్మోహమాటం, నిజాయితీ యింకెక్కడా కనిపించవు అం చేత నా మీద ఫ్రెంచి రచయితల ప్రభావం ఉందనుకుంటాను, ముఖ్యంగా...డెలికేట్ టచెస్ అంటారే అవి పాశ్చాత్య రచయితలకి తెలిసినంతగా మన వాళ్ళకి తెలియవు నా రచనల్లో మీ కెక్కువగా కనబడేవవే చాలా చిన్న విషయాలు నన్నమితంగా కదిలిస్తాయి నా పాత్రలైనాసరే కష్టాల్లో ఉండడం సహించలేను...యీ నా కృషిలో దేశంకోసం, సాహిత్యం, సంస్కృతికోసం నేను చేసే యీ కొద్దిపాటి ప్రయత్న మనండి, యింకోటనండి, దీనిలో మా వారి పాత్ర చాలా ఉంది వారి సహకారం, తోడ్పాటు సహాయం లేకపోతే నే నిలా కళకోసం పాటుపడ గలిగి ఉండేదాన్ని కాదు నా రచనలకి, గానానికి, యితర కళా సేవకి ప్రోత్సాహ మిచ్చిన వారిలో మొట్టమొదట ఆయన పేరు చెప్పుకోవాలి .."

"ఓరి బాబోయ్'" అని వెనక్కి చూడకుండా పరుగెత్తు కొచ్చాడు రామేశం రామేశాని కదొక గొప్పషాక్ దాన్నుంచి అతను త్వరలో తేరుకోలేదు ఎన్నటికీ తేరుకో లేదేమో'

"అసలు యెన్నడూ దేనిమీదా ఆశ పెట్టుకోకు ఆశ బాధకి నాంది దేన్ని గురించీ యెక్కువగా ఆలోచించకు దేని కోసం యెదురు చూడకు దేన్నీ నమ్మకు యీ శరీరం, చేతులు, కాళ్ళు, ఈ జుట్టు యివన్నీ యెప్పటికో ఒకప్పటికి నశిస్తాయి వాటి కోసం, వాటి నేవో ఉద్ధరించాలని తాపత్రయ పడకు సాధ్యమైనంత వరకు అన్నిటికీ దూరంగా ఉండు . వదులుకో, సర్వం వదులుకో వివేకానంద నూట ముప్ఫై ఒకటో పేజీలో ఏమంటాడో తెలుసా' మన మంతా నూతిలో కప్పలం యిందులో కూలబడి యేదో బెకబెక మంటాం ఎన్నో ఊహించుకుంటాం, మోసపోతాం ఎగరబోతాం కింద పడతాం కాని వీటన్నిటికీ మించిన విషయాలు, నిజమైనవి, చాలా ఉన్నాయి విశాల ప్రపంచం బయట చాలా ఉంది దాన్ని చేరుకోడానికి ప్రయత్నించు . రాధాకృష్ణ నాలుగు వందలయాభైయో పేజీ, పదహారో లైన్లో "

పెద్ద వరదలా ఏమేమిటో మాట్లాడేసి సత్తెనపల్లి రాగానే దిగి పోయాడు రామేశం, నాతో రమ్మన్నా వినకుండా యీ సందేశాన్ని యిలా బుజాన మోసుకుని యింకా యెంతో మందికి జేరేయాలన్న ఉద్వేగం వాడిలో కన్పించింది